

**నులి పురుగులనేవి** పేగుల నుంచి పోషకాలు గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. ఈ వ్యాధి కారకాన్ని అస్కారియాసిస్ అంటారు. ఇవి పేగుల్లో నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు. రక్త హీనత, పోషకాహార లోపం, ఆకలిలేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్ని ఇబ్బందులు కలుగుతాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పేద పిల్లలు చెప్పులు లేకుండా నడవడంతో వచ్చే అవకాశముంది. ప్రధానంగా అపరిశుభ్రతతో నులి పురుగులు వ్యాపిస్తాయి.

–కామారెడ్డి, జూన్ 19

**నేడు నులిపురుగుల దినోత్సవం**

- పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి
- అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 1 నుంచి 19 ఏండ్ల పిల్లలకు చేరేలా చర్యలు
- జిల్లాలో 2,50,254 మంది గుర్తింపు

# నులిపేద్దాం..

### నులి పురుగులు ఎందుకు వస్తాయి..

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. కలుషిత ఆహారం, ఈగలు వాలిన తినుబండారాలు, దుమ్ము, ధూళి పడిన పదార్థాలు తినడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం, చేతి గోర్లను శుభ్రంగా ఉంచుకోకపోవడం, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరుకులు శుభ్రమైన నీటితో కడగపోవడంతో నులి పురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడూ చేతులు శుభ్రంగా కడుకోవాలి. ఆహార పదార్థాలపై ఎల్లప్పుడు మూతలు పెట్టాలి.

### జిల్లాలో 2,50,254 మంది గుర్తింపు..

జిల్లాలో 1 నుంచి 19 ఏండ్లలోపు 2,50,254 మందిని గుర్తించారు. వారికి నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 20 (గురువారం) ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాలో 1191 అంగన్‌వాడీ కేంద్రాల్లో 80,166 మంది చిన్నారులు, 1079 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,05,407 మంది విద్యార్థులు, 178 ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో 48,734 మంది, 17 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 4,514 మంది, 23 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 5,248 మంది మొత్తం 2,44,069 మంది విద్యార్థులను గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా 2,50,254 మంది విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకున్నారు.



### నివారణకు చర్యలు..

అస్కారిస్ గుడ్లతో కలుషితమైన ఆహారం లేదా పానియాలను తీసుకోవడంతో సంక్రమిస్తాయి. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి. 1 నుంచి 2 ఏండ్ల వయస్సు ఉన్న పిల్లలు 400 ఎంజీలో సగం అంటే 200 ఎంజీ వేసుకోవాలి. 3 నుంచి 19 ఏండ్ల వయస్సు వారు 400 ఎంజీ వరకు వేసుకోవచ్చు. మాత్రలు వేసుకున్న ఒక రోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మల విసర్జన ద్వారా బయటికి వెళ్తాయి. ఐదు, ఆరు, ఏడు నెలల గర్భిణులు సైతం ఈ డీవార్మింగ్ టాబ్లెట్‌లు వేసుకోవచ్చు. ఐదేండ్లలోపు చిన్నారులకు సిరప్, ఐదేండ్లు దాటిన వారికి మాత్రలు అందజేస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర వ్యాధులకు మందులు వాడుతున్న వారు వేసుకోకూడదు. నులిపురుగులు ఉన్నవారు మాత్రలు వేసుకుంటే వికారం, వాంతులు, స్వల్పంగా జ్వరం వచ్చే అవకాశముంది.

### జిల్లాలో 2,50,254 మందిని గుర్తించాం..



జిల్లాలో 1 నుంచి 19 ఏండ్లలోపు 2,50,254 ఉన్నట్లు గుర్తించాం. ప్రతి ఒక్కరూ గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకున్నాం. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మాత్రలు వేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం. 1 నుంచి 19 ఏండ్ల వారు ఈ మాత్రలు వేసుకోవాలి.

- డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

## బిచ్కుందలో నకిలీ విత్తనాల విక్రయం

- మామూళ్ల మత్తులో అధికారులు
- నామమాత్రంగా తనిఖీలు
- నష్టపోతున్న రైతులు



విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్సై మోహన్‌రెడ్డి, ఏవో రాజలింగం



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మీప్రసన్న

బిచ్కుంద, జూన్ 19: అధికారులు మామూళ్ల మత్తులో పడి నామమాత్రంగా తనిఖీలు నిర్వహించడంతో మండలంలో నకిలీ విత్తనాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన దీప్‌చంద్ ఈనెల 8వ తేదీన బిచ్కుందలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గ్రీన్‌గోల్డ్ కంపెనీకి చెందిన 25 కేజీల సోయాబీన్ విత్తనాల బస్తా ధర రూ.3,050 కాగా మొత్తం 12బస్తాలను కొనుగోలు చేశాడు. వాటిలో ఐదు బస్తాలను మంగళవారం విత్తడానికి తీసుకెళ్లాడు. అక్కడ బస్తాను తెరిచి చూడగా మొత్తం విత్తనాలు నల్లగా ముక్కిపోయి, నాసిరకంగా ఉన్నాయి. ఈ విషయమై దుకాణాదారుడిని ప్రశ్నించగా.. తనకేమీ సంబంధం లేనట్లు మాట్లాడాడు. ఇద్దరి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు రైతును సముదాయించి విత్తన బస్తాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏడీఏ లక్ష్మీప్రసన్న, ఏవో రాజలింగం బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని రైతు సమక్షంలో విత్తన బస్తాలను పరిశీలించారు. ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. సోయాబీన్ విత్తనాలను పరీక్షించడానికి ల్యాబ్‌కు పంపిస్తున్నామని వ్యవసాయాధికారులు తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తున్న దుకాణాదారులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

### న్యాయం చేయాలి..

మాకు వ్యవసాయమే జీవనాధారం. అప్పు చేసి విత్తనాలు కొనుగోలు చేశా. తీరా చూస్తే అవి ముక్కిపోయి కనిపించాయి. ఈ విషయంలో దుకాణాదారుడిపై చర్యలు తీసుకొని నాకు తగిన న్యాయం చేయాలి.

- దీప్‌చంద్, రైతు



### అనుమతులు లేకుండా
## వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు

**పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ హెచ్చరిక**

వినాయక్‌నగర్, జూన్ 19 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎక్కువ శాతం ఎలాంటి అనుమతులూ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, అలాంటి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ హెచ్చరించారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, గేమింగ్ జోన్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు తదితర వ్యాపారులు ఆయా శాఖల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు కావాల్సిన నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని తెలిపారు. సంబంధిత శాఖల నుంచి భద్రతకు సంబంధించిన పర్మిషన్లు తీసుకోని వ్యాపారాలపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు తగిన చర్యలు తీసుకోవాలని సీపీ సూచించారు.

### సైబర్ ఉచ్చులో పడి
## మోసపోయిన యువకుడు

**అకౌంట్ నుంచి రూ.2.09 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

బాన్సువాడ రూరల్, జూన్ 19 : బాన్సువాడ మండలంలోని తాడ్కోల్‌కు చెందిన మహేందర్‌రెడ్డి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకొని రూ.2.09లక్షలు పోగొట్టుకున్న ఉదంతం బుధవారం వెలుగులోకి వచ్చింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్కోల్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి ఫోన్‌కు ఈ నెల 8న ఓ మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను క్లిక్ చేయడంతో రూ.400 బోనస్ అతని అకౌంట్‌లో జమ అయినట్లు తెలిపారు. దీన్ని నమ్మిన యువకుడు విడుతల వారీగా రూ.2లక్షల తొమ్మిది వేలు వివిధ అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపారు. ఇంకా కొంత మొత్తం డబ్బులు పంపాలని అవుతలి వ్యక్తులు తెలపడంతో అనుమానం వచ్చిన యువకుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నట్లు గుర్తించి వెంటనే 1930కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

## సంతకు వెళ్లొస్తూ మృత్యు ఒడికి..

**రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం**




సాయిబాబా, పోశవ్వ (ఫైల్)

కోటగిరి, జూన్ 19: వారంతపు సంతకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పుప్పల సాయిబాబా (56), పోశవ్వ (51) దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. బుధవారం కోటగిరిలో వార సంతలో నిత్యావసర వస్తువులు కొనేందుకని ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. అయితే, ఎక్లాస్‌పూర్‌క్యాంప్‌కు రాగానే వాహనం అదుపు తప్పడంతో బండరాయికి ఢీకొని కిందపడ్డారు. తలకు బలమైన గాయాలు కావడంతో పోశవ్వ, సాయిబాబా అక్కడిక్కడే మృతి చెందారు. అయితే, ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి పడి మృతి చెందారా..? లేక ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందా? అన్న దానిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్సై సందీప్ తెలిపారు.

# అమ్మకానికి 60 బొగ్గు గనులు

**హైదరాబాద్ వేదికగా రేపు వేలం వేయనున్న కేంద్రం**







హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య బొగ్గు గనులను వేలం వేయనున్నది. ఈసారి ఇందుకు హైదరాబాద్ వేదిక అవుతున్నది. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ 10వ విడుత కోల్ బ్లాక్స్ వేలాన్ని మాత్రం ఇక్కడ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం (ఈ నెల 21) దేశవ్యాప్తంగా ఉన్న 60 బొగ్గు బ్లాక్‌లను మోదీ సర్కారు అమ్మకానికి తెస్తున్నది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనాతోపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఎంఎస్‌టీసీ ప్లాట్‌ఫామ్‌పై వేలానికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు. పర్సంటేజ్ రెవెన్యూ షేర్ మోడల్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారు. ఇక ఈ గనుల్లో కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు బ్లాకులున్నాయి.

### సింగరేణి పాల్గొనేనా..

ఈ బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందా? లేదా? అన్నది కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి నాడు వేలానికి దూరంగా ఉన్నది. కాగా, తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుండగా, ఇక్కడ 119 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నట్టు తేల్చారు. దీంతో ఈ బ్లాక్‌పట్ల సింగరేణి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా అంత శ్రేయస్కరం కాదన్న భావనలో అధికారులున్నారు. ఇదే విషయంపై సింగరేణి సీఎండీ బలరాంను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తర్వాతే వేలంలో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తామన్నారు.

### వేలాన్ని అడ్డుకుంటాం: రాజిరెడ్డి

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకొని సింగరేణిని కాపాడుకుంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర ఖనిజ నిల్వలను వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలని, ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టంచేశారు. వేలం వేస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 20 వేల మంది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు.



# 1.56 లక్షల కోట్లు

**గత ఆర్థిక సంవత్సరం ప్రైవేట్‌పరమైన ప్రభుత్వ ఆస్తుల విలువ**

### ఈ ఆర్థిక సంవత్సరం ఇంకో 2 లక్షల కోట్ల ఆస్తులు ఔట్

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్‌ఎంపీ) కింద కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. బుధవారం వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులను అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులను సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. ఈ క్రమంలోనే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేసింది.

### వచ్చే మార్చికల్లా..

2023-24తో కలిపితే మూడేండ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించినట్టవగా, తొలి రెండేండ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా అమ్మేయడం గమనించదగ్గ అంశం. ఇక లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే మరింత సర్కారీ సంపద.. ప్రైవేట్‌పరం కాబోతున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ 33 ఆస్తులను కూడా గుర్తించింది. కాగా, రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

**గత ఆర్థిక సంవత్సరం కేంద్రం అమ్మేసిన ప్రభుత్వ ఆస్తులు**

| శాఖ | విలువ (రూ.కోట్లలో) |
|---|---|
| రోడ్డు రవాణా, జాతీయ రహదారులు | 40,314 |
| బొగ్గు | 56,794 |
| విద్యుత్తు | 14,690 |
| గనులు | 4,090 |
| పెట్రోలియం-సహజ వాయువు | 9,587 |
| పట్టణాభివృద్ధి | 6,480 |
| షిప్పింగ్ | 7,627 |
| మరికొన్ని శాఖల్లో | 16,500 |

### వాటాల విక్రయం, డివిడెండ్లతో..

అందినకాడికి అమ్ముకుంటూపోతున్న మోదీ సర్కారు.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలను తగ్గించుకున్న కేంద్రం.. ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించిన సంగతి విదితమే. ఇక ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేండ్ల హయాంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినది తెలిసిందే. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలపాలవుతున్నది.



## 120 కోట్లు దాటిన టెలికం కస్టమర్లు

న్యూఢిల్లీ, జూన్ 19: టెలికం వినియోగదారులు మళ్లీ 120 కోట్లు దాటారు. ఏప్రిల్ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 120.12 కోట్ల మంది టెలికం సబ్‌స్క్రైబర్లు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 116.54 కోట్ల మంది ఉన్నా రు. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. కొత్తగా జియో నెట్‌వర్క్‌ను 26.8 లక్షల మంది ఎంచుకోవడంతో మొత్తం సంఖ్య 47.24 కోట్లకు చేరుకోగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 7.52 లక్షల మంది జతవడంతో 26.75 కోట్లకు చేరుకున్నారు.

## ఏసీల ధరలకు రెక్కలు


**8 శాతం వరకు భారీగా పెరిగిన విలువ**

న్యూఢిల్లీ, జూన్ 19: ఉష్ణోగ్రతలు తారెత్తిస్తుండటంతో అంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రత రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు సైతం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు రికార్డు స్థాయి రెండంకెల వృద్ధి నమోదైంది. అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయన్న అంచనాతో వీటి ఉత్పత్తి సంస్థలు ఇదే అదనుగా ఏకంగా ధరలను కూడా భారీగా పెంచాయి. గతంలోనే ధరలను స్వల్పంగా పెంచిన సంస్థలు జూన్ నెలలో మరోసారి 6 శాతం నుంచి 8 శాతం వరకు సవరించాయి.

### ఉత్పత్తి భారీ పెంపు..

డిమాండ్ అధికంగా ఉండటంతో ఏసీల తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాయి కూడా. సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు ఉపక్రమించాయి. టాప్ కంపెనీలైన వోల్టాస్, ఎల్‌జీ, లాయిడ్‌లు ఏకంగా తమ కెపాసిటీని రెండింతలు పెంచుకున్నాయి. ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి లాయిడ్ పేరుతో ఏసీలను విక్రయిస్తున్న హావెల్స్ రూ.30-50 కోట్ల వరకు పెట్టుబడి కూడా పెట్టింది.

- ఈ ఏడాది ఏసీల విక్రయాలు 30-40 శాతం వృద్ధితో 1.5 కోట్ల యూనిట్లకు చేరుకుంటుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా.
- దక్షిణాది కంటే ఉత్తరాదిలో ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏసీ తయారీ సంస్థలు తమ ఏసీ స్టాక్‌లను దక్షిణాది నుంచి ఉత్తరాదికి తరలిస్తున్నారు.
- ఏసీల ఇన్‌స్టాలేషన్- సేవలు అందించే సిబ్బంది కొరత అధికంగా ఉన్నది.
- ఏసీల తయారీ సంస్థలైన వోల్టాస్, హావెల్స్‌లు తమ ఏసీల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.
- డిమాండ్ అధికంగా ఉండటంతో విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి సంస్థలు. ముఖ్యంగా కంప్రెషర్లు, మోటర్లు, పీసీబీ సర్క్యూట్స్‌లు ఉన్నాయి.



*ఈ ఏడాది ఏసీ ఇండస్ట్రీకి గోల్డెన్ ఈయర్. దేశవ్యాప్తంగా అత్యధిక రాష్ర్టాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో జూన్ నెలలోనూ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి.*

*సంజయ్ చిత్కారా, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్*

## వాణిజ్య



### టాటా కమర్షియల్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 19: టాటా మోటర్స్ మరోసారి వాహన ధరలను పెంచింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కమర్షియల్ వాహన ధరలను 2 శాతం పెంచుతున్నట్లు బుధవారం ప్రకటించింది. కమోడిటీ ధరలు పెరగడం ఇందుకు కారణమని పేర్కొంది.

### ఒమెగాలోకి 500 కోట్లు

హైదరాబాద్, జూన్ 19: హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్(ఒమెగా హాస్పిటల్స్) తొలిసారిగా భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. ఫండ్ మేనేజ్ మోర్గాన్ స్టాన్లీ నుంచి రూ.500 కోట్ల నిధులు సేకరించినట్లు బుధవారం వెల్లడించింది. మరిన్ని రాష్ర్టాలకు విస్తరించడానికి, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఒమెగా హాస్పిటల్స్ ఎండీ మోహన్ వంశీ తెలిపారు.

### ఎయిర్ ఇండియాలో ప్రీమియం క్లాస్ సీట్లు

ముంబై, జూన్ 19: వచ్చే నెల నుంచి ఎంపిక చేసిన రూట్లలో ప్రీమియం ఎకానమి క్లాస్ సీట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఇందుకోసం టాటా గ్రూపునకు చెందిన ఈ విమానయాన సంస్థ ఏకంగా రెండు ఏ320 నియో ఎయిర్‌క్రాఫ్ట్‌లను మార్చివేసింది. దీంట్లో ఎనిమిది సీట్లు బిజినెస్ క్లాస్ కోసం కేటాయించిన సంస్థ..24 సీట్లు ప్రీమియం ఎకానమి, మిగతా 132 సీట్లు ఎకానమి విభాగానికి చెందినవి.

### బ్లూ డార్ట్ డ్రోన్ సేవలు

ముంబై, జూన్ 19: స్కై ఎయిర్ సహకారంతో డ్రోన్ ఆధారిత డెలివరీ సేవలను ప్రారంభిస్తున్నట్టు లాజిస్టిక్స్ ఆపరేటర్ బ్లూ డార్ట్ ప్రకటించింది. కాగా, 2021లో వికారాబాద్‌లో విజువల్ లైన్ ఆఫ్ సైట్ ట్రయల్స్ చేపట్టిన బ్లూ డార్ట్.. అప్పటి తెలంగాణ ప్రభుత్వ 'మెడిసిన్ ఫ్రం ది స్కై' కార్యక్రమం కింద స్కై ఎయిర్‌తో కలిసి బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ ట్రయల్స్‌నూ చేపట్టినది తెలిసిందే.